## తాసీల్దార్ ఆఫీస్‌లో ఉద్యోగుల కొట్లాట

మునుగోడు, డిసెంబర్ 20 : మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, ఆర్ఐలు విధుల విషయంలో శుక్రవారం కొట్లాడుకున్నారు. కార్యాలయం సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలు జూనియర్ అసిస్టెంట్ యాదయ్య దగ్గర ఉన్నాయి. వీటిని ఐర్ఐ నాగరాజుకు అప్పగించాల్సి ఉండగా.. తీసుకోవాల్సిందిగా యాదయ్య ఆర్ఐకి సూచించాడు. దీనికి ఆర్ఐ స్పందిస్తూ 'ఇప్పుడు నీ దగ్గర ఉన్న అర్జీలన్నీ వద్దు.. ఒక్కటి మాత్రమే ఇవ్వమని జూనియర్ అసిస్టెంట్‌కు చెప్పాడు. ఒక్కటి తీసుకుంటే ఎలా అన్నీ తీసుకోండి అని యాదయ్య సమాధానం చెప్పగా.. నువ్వేంటి నాకు చెప్పేది అని ఆర్ఐ అనడంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి గొడవ ప్రారంభమైంది. కార్యాలయంలో ప్రజలు, అధికారులు చూస్తుండగానే జూనియర్ అసిస్టెంట్ యాదయ్యపై ఆర్ఐ నాగరాజు చేయి చేసుకున్నాడు. దీంతో యాదయ్య తనను ఆర్ఐ కొట్టాడని తాసీల్దార్‌కు, చండూరు ఆర్డీఓకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై స్పందించిన ఆర్డీఓ, తాసీల్దార్ ఆర్ఐపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తనపై జరిగిన దాడిపై శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని జూనియర్ అసిస్టెంట్ యాదయ్య పేర్కొన్నాడు.



నల్లగొండలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల

# కేటీఆర్ జోలికి వస్తే ఖబడ్దార్

- అర్థంలేని ఆరోపణలు కాంగ్రెస్‌కే సాధ్యం
- రాజకీయంగా ఎదుర్కోలేకనే తప్పుడు కేసులు
- మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్


సూర్యాపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 20 : తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన దిగ్గజం మాజీ మంత్రి కేటీఆర్ జోలికి వస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ రాజ్యసభ సభ్యుడు, బీఆర్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ హెచ్చరించారు. సూర్యాపేటలోని ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులకు జైళ్లు, కేసులు కొత్తకాదని, అక్రమ అరెస్టులను ప్రజలు సహించరని అన్నారు. కేటీఆర్ ఎలాంటి తప్పు చేయకున్నా తప్పుడు కేసులతో అరెస్టు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, రేవంత్‌రెడ్డి అవినీతిపై పోరాడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం, ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేయడం సరికాదని తెలిపారు. ఏం చేసినా చెల్లుతుందని అనుకోవడం అవివేకమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేటీఆర్‌పై ఈ-కార్ రేస్ అంటూ తప్పులు కేసులు పెట్టడంతో ప్రజల్లో అభాసు పాలవుతారని చెప్పారు. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేందుకు ప్రపంచ వ్యాప్తంగా జరిగే కార్ రేస్‌ను ప్రభుత్వ నిబంధనలకు లోబడి కేటీఆర్ పెట్టారని, అందుకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయన్నాయని తెలిపారు. కేటీఆర్‌పై ఫోన్ టాపింగ్, జన్వాడ ఫామ్ హౌజ్, డ్రగ్స్ అని ఎన్నో కేసులు పెట్టాలని చూసినా ఒక్క కేసు నిలబడలేదని, కోర్టులో చీవాట్లు తినాల్సి వచ్చిందని గుర్తు చేశారు. కేటీఆర్‌ను జైల్లో పెట్టే దురాలోచనకు ప్రభుత్వం పూనుకుంటుందని ఆరోపించారు. ఈ-కార్ రేస్‌లోని వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ ఆత్మకూర్.ఎస్ మండల అధ్యక్షుడు తూడి నర్సింహారావు, నాయకులు ఉప్పల ఆనంద్, బూర బాలసైదులు, ఈదుల యాదగిరి, బండారు రాజా, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, మీనయ్య పాల్గొన్నారు.

## అక్రమ కేసులు పెట్టి రాష్ట్ర పరువు తీస్తున్నారు

- మంత్రిగా కేటీఆర్ ఉన్న సమయంలో హైదరాబాద్ ఇమేజ్ పెరిగింది
- ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలం
- బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), డిసెంబర్ 20 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు బనాయించి కాంగ్రెస్ ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తున్నదని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ పట్టణంలో శుక్రవారం ఆచప విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ బ్రాండ్‌ను పెంచేందుకు ఫార్ములా -ఈ రేస్‌ను నిర్వహించిందని గుర్తు చేశారు. ఫార్ములా-ఈ రేస్‌తో తెలంగాణ రాష్ట్రానికి రూ.700 కోట్ల లాభం వచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర పరువు తీసేలా వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్న సమయంలో హైదరాబాద్ ఇమేజ్ పెరిగిందని చెప్పారు. అక్రమ కేసులు బనాయించిన రేవంత్‌రెడ్డి సర్కార్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. లగచర్ల ఘటనతో అక్రమ కేసులో అరెస్టు అయిన వారికి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా మిగిలిన రైతులకు న్యాయం జరిగిందని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలతో విద్యార్థులు తీవ్ర అస్వస్థకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి, సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, పల్లా లోహిత్ రెడ్డి, ఉమేందర్‌కుమార్, తులసీరాం, ఖాదర్‌బాబా, అఫ్రోజ్, తరి గోవర్ధన్, గుండాల వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాలపై ప్రత్యేక దృష్టి

- గతేడాది కంటే ఉత్తమ ఫలితాల కోసం అధికారుల చర్యలు
- 90 రోజుల ప్రణాళికతో ముందుకు
- ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- సబ్జెక్ట్‌వారీగా క్వశ్చన్ బ్యాంక్ తయారీ.. విద్యార్థులతో నిత్యం సాధన
- ఇంటర్ బోర్డు నుంచి సైన్స్ పరికరాలు, సీసీ కెమెరాలకు నిధులు విడుదల

రామగిరి, డిసెంబర్ 20 : ఇంటర్మీడియట్ 2024-25 విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాల కోసం విద్యాశాఖ అధికారులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ప్రత్యేక దృష్టి సారించారు. గతేడాది కంటే ఈ విద్యా సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. మార్చి 2025లో జరిగే పబ్లిక్ పరీక్షల కోసం ఇప్పటికే 90 రోజుల ప్రణాళికలను ప్రారంభించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు వారీగా ఆయా అధ్యాపకులు ప్రశ్నల నిధిని తయారు చేసి నిత్యం విద్యార్థులతో ప్రాక్టీస్ చేయిస్తున్నారు. మరో వైపు అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ప్రయోగ పరికరాలు కొనుగోలు కోసం ఒక్కో కళాశాలకు రూ. 25వేలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 6వేలను ఇంటర్ బోర్డు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. కళాశాలలో విద్యార్థులకు ఆకలి తీర్చేందుకు ఎవరైనా దాతలు ముందుకు వస్తే బాగుంటుందని పలు కళాశాలల నిర్వాహకులు కోరుతున్నారు.


### ఉమ్మడి జిల్లాలో 12వేల మంది విద్యార్థులు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 32 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12,060 మంది ఉన్నారు. వీరందరికీ ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా సమయం కేటాయిస్తూ అధ్యాపకులు చదివిస్తున్నారు. దీంతో జిల్లాలో ఫలితాలు పెరిగేలా చూస్తున్నారు.

### ప్రయోగాలకు, సీసీ కెమెరాలకు నిధులు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షలకు ఉపయోగపడే ప్రయోగ పరికరాల కొనుగోళ్లకు ఇంటర్మీడియట్ బోర్డు ఈ పర్యాయం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ప్రతి కళాశాలకు రూ. 25వేలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 6వేలను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ బ్యాంక్ ఖాతాల్లో రెండు రోజుల క్రితం జమచేసింది. దీంతో ప్రాక్టికల్ సామగ్రి పూర్తి అందుబాటులోకి రానుండగా, సీసీ కెమెరాలతో నిఘా ఉండనుంది.

### వందశాతం ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికలు



వందశాతం ఫలితాలు సాధించేలా అధ్యాపకులందరితో కలిసి ప్రత్యేక ప్రణాళిక తయారు చేశాం. ఇప్పటికే కళాశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థినులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలమేరకు 90రోజుల ప్రణాళికను విజయవంతంగా అమలు చేస్తున్నాం.

- సుధారాణి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నల్లగొండ

### ఈ సారి జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపాలి



అన్ని కళాశాలల్లో పక్కా ప్రణాళికతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించాం. ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు సమిష్టిగా పనిచేయాలి. ఉత్తమ ఫలితాలు సాధించి ఈ పర్యాయం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రయోగ పరికరాలు, సీసీ కెమెరాలకు నిధులివ్వడం శుభ పరిణామం. వాటిని కమిటీలతో ఆమోదించి త్వరగా కొనుగోలు చేసి అందుబాటులోకి తేవాలి.

- దస్రూనాయక్, డీఐఈఓ, నల్లగొండ

## బీఆర్ఎస్ నేతలను భయపెట్టే కుట్రలో భాగమే కేటీఆర్‌పై కేసు

- ఈ-కార్ రేస్‌తో ప్రపంచంలోనే కేటీఆర్ రాష్ట్ర ప్రతిష్టతను పెంచారు
- రేస్ నిర్వహించిన సంస్థకు ప్రభుత్వం డబ్బులు ఇస్తే అవినీతి ఎలా అవుతది
- హామీలు అమలు చేయలేక రేవంత్ డైవర్షన్ పాలిటిక్స్
- బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి తదితరులు

నల్లగొండ, డిసెంబర్ 20 : కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలపై నిత్యం ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను భయపెట్టే కుట్రలో భాగంగానే మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు పెట్టారని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. ఈ-రేసింగ్ అనేది ప్రపంచ ఈవెంట్లల్లో భాగమని, చాలా రాష్ట్రాలు అంతర్జాతీయ స్థాయిలో తమ కీర్తిని చాటుకోవడానికి ఇలాంటి రేసింగ్స్ నిర్వహిస్తాయని తెలిపారు. అందులో భాగంగానే కేటీఆర్ హైదరాబాద్‌లో ఈ-కార్ రేస్ నిర్వహించారని, దీనికి అప్పట్లో కేంద్ర మంత్రులు కూడా హాజరయ్యారని చెప్పారు. కేటీఆర్ ఒక మంత్రిగా రాష్ట్ర అభివృద్ధి కోసం రూ.3లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తెచ్చినట్లు తెలిపారు. లగచర్ల, మూసీ, హైడ్రాలపై ప్రశ్నిస్తున్న కేటీఆర్‌ను ఎలాగైనా జైలుకు పంపాలనే కుట్రతోనే రేవంత్ అక్రమ కేసు పెట్టించినట్లు ఆరోపించారు. ఈ-రేస్ కోసం డబ్బులను హెచ్ఎండీఏ ఇస్తే సదరు సంస్థ తీసుకున్నదని, అలాంటప్పుడు అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పాలని అన్నారు. నిబంధనల ప్రకారం చేయలేకపోవచ్చు కానీ తప్పు ఎక్కడ జరిగిందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రొసీజర్ ప్రకారం చేయాల్సింది అధికారులని, దీనికి కేటీఆర్‌కు సంబంధం ఏంటో చెప్పాలని అన్నారు. నిజంగా కేటీఆర్ తప్పు చేస్తే దీనిపై అసెంబ్లీలో ఎందుకు చర్చ పెట్టం లేదని ప్రశ్నించారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదని, ఇలాంటి కేసులను ఎదుర్కోవడంతోపాటు ప్రజలకు కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న కుట్రలను బయట పెడుతామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలీ, జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లిఖార్జున రెడ్డి, నాయకులు కటికం సత్తయ్య గౌడ్, మాలె శరణ్యారెడ్డి, బోనగిరి దేవేందర్, దేప వెంకట్ రెడ్డి, ఐతగోని యాదయ్య గౌడ్, పల్‌రెడ్డి రవీందర్ రెడ్డి, కొండూరు సత్యానారాయణ, మారగోని గణేశ్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, గున్ రెడ్డి యుగంధర్ రెడ్డి, తుమ్మల లింగస్వామి పాల్గొన్నారు.


బోనాలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## బోనాలతో నిరసన

- కలెక్టరేట్ వద్ద 11వ రోజుకు చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షలు

రామగిరి, డిసెంబర్ 20 : విద్యాశాఖ సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు నాడు పీసీసీ హోదాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెగ్యూలర్ చేస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని నల్లగొండ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షలు శుక్రవారం 11వ రోజుకు చేరాయి. ప్రభుత్వానికి, రేవంత్‌రెడ్డికి కనువిప్పు కలిపించాలనే సంకల్పంతో ఉద్యోగులంతా కలెక్టరేట్ నుంచి డైట్ అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు డప్పు చప్పుళ్లు, పోతరాజు వేషధారణల మధ్య బోనాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపి మాట్లాడారు. న్యాయమైన సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్‌ను తక్షణమే పరిష్కరించాలని కోరారు. పలు సంఘాల నేతలు కూడా మద్దతు తెలిపారు. నల్లగొండ పర్యటనలో ఉన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల ప్రాంగణంలో కలిశారు. తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి ఆవేదన తెలిపారు. ఈ దీక్షల్లో సమగ్ర శిక్ష ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు మొలుగురి కృష్ణ, ప్రచార కార్యదర్శి చాందపాక నాగరాజు, సమగ్రశిక్ష ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్త దవాఖాన బ్లాక్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


నల్లగొండ జిల్లా ఆస్పత్రి ఆవరణలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నీలగిరి, డిసెంబర్ 20 : జిల్లా కేంద్రంలోని ప్రధాన దవాఖానలో కొత్త బ్లాక్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిని శుక్రవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం నూతన భవనంలోకి మారగా, గతంలో నిర్వహించిన ఏపీ బ్లాక్‌ను పూర్తిగా తీసివేసి రెండింటి స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ.32 కోట్లు విడుదల చేసిందన్నారు. తక్షణమే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. మె వెంట అసుపత్రి సూపరింటెండెంట్ అరుణకుమారి, ఈఈ జైపాల్‌రెడ్డి, కాంట్రాక్టర్ అధికారులు తదితరులు ఉన్నారు.



మిర్యాలగూడ పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన ఆటో కార్మికులు

## ఆటో కార్మికుల నిర్బంధం

- చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అరెస్టులు
- ప్రభుత్వ తీరుపై మండిపడిన కార్మికులు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్లు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. పోలీస్‌స్టేషన్‌లలో నినాదాలు చేశారు. ప్రభుత్వం ఫ్రీ బస్సు పెట్టి ఆటో డ్రైవర్ల నడ్డి విరిచిందని, తమను ఆరెస్టులు చేస్తూ తమ హక్కులను హరిస్తున్నదని వాపోయారు. నల్లగొండ, త్రిపురారం, చందంపేట, నాగార్జున సాగర్, మిర్యాలగూడ, ఆత్మకూర్.ఎం, చిట్యాల మండలాల నుంచి తరలివెళ్తున్న ఆటోకార్మికులను అరెస్ట్ చేశారు.

## 20 నెలల తర్వాత మృతదేహానికి రీపోస్ట్‌మార్టం

కోదాడ రూరల్, డిసెంబర్ 20: పట్టణ పరిధి బాలాజీ నగర్ సమీపంలోని ఆర్‌కే మేజర్ కాల్వలో 20 నెలల క్రితం ఓ మృతదేహం కొట్టుకొని రావడంతో పట్టణ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిదిగా కేసు నమోదు చేసి కోమరబండ శివారులోని చెరువు సమీపంలో ఖననం చేశారు. కాగా, శుక్రవారం ఆ మృతదేహాన్ని తిరిగి బయటకు తీసి రీపోస్ట్ మార్టం నిర్వహించారు. చనిపోయిన వ్యక్తిది హైదరాబాద్ కావడంతో అతని బంధువుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అక్కడి పోలీసులు.. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మృతుడు హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన వివాహితుడు కుమార్ (35) ఓ బాలికను ట్రాప్ చేసి అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులు, బంధువులు దాడి చేశారు. ఈ దాడిలో కుమార్ మృతిచెందడంతో నిందితులు మృతదేహాన్ని మునగాల మేజర్ కాల్వలో వదిలి వెళ్లారు. నీటి ప్రవాహానికి బాలాజీ నగర్ కాల్వలోకి కొట్టుకు రావడంతో పట్టణ పోలీసులు ఖననం చేశారు. విషయం తెలియడంతో తిరిగి రీపోస్ట్‌మార్టం నిర్వహించారు.

## అదుపు తప్పి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు

- పది మందికి గాయాలు



గుంతలో ఇరుక్కుపోయిన బస్సు

మిర్యాలగూడ, డిసెంబర్ 20 : ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి రాళ్ల కుప్పను ఢీకొట్టి గుంతలో పడిపోయింది. దాంతో బస్సులో ప్రయాణిస్తున్న పది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి- నార్కట్‌పల్లి బైపాస్ రోడ్డు నందిపాడు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒంగోలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కావేరి ట్రావెల్స్ బస్సు 35 మంది ప్రయాణికులతో వెళ్తున్నది. ఈ క్రమంలో డ్రైవర్ నిద్ర మత్తు వల్ల నందిపాడు గ్రామ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న రాళ్ల కుప్పను బస్సు ఢీకొట్టడంతో సమీపంలో ఉన్న గుంతలో ఇరుక్కుపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న పది మందికి గాయాలయ్యాయి. వీరంతా పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించుకొని తిరిగి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

## చివరి భూములకు నీరు అందేలా సహకరించాలి

- ఎన్నెస్పీ సీఈ అజయ్‌కుమార్


సీఈ అజయ్‌కుమార్

నందికొండ, డిసెంబర్ 20 : సాగర్ ఎడమ కాల్వకు యాసంగి సాగు కోసం ఈ నెల 15 నుంచి ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిన నీటి విడుదల కొనసాగుతున్నదని, నీటిని రైతులు పొదుపుగా వాడుకుంటూ చివరి భూములకు నీరు అందేలా సహకరించాలని ఎన్నెస్పీ సీఈ అజయ్‌కుమార్ కోరారు. ఎడమ కాల్వ కింద 6 లక్షల 30 వేల ఎకరాలకు నీరు అందించేలా అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉందని తెలిపారు. రైతులు కాల్వలకు గండ్లు కొడితే ఉపేక్షించబోమని, నిరంతరం కాల్వలపై పర్యవేక్షణ చేపడుతున్నామని చెప్పారు. యాసంగిలో 120 రోజులు నీటిని అందిచేందుకు నీటి పారుదల శాఖ ప్రణాళికలను రూపొందించిందన్నారు. మెదటి దఫా నాట్లు పడేంత వరకు 27 రోజుల పాటు నీటి విడుదల ఉంటుందని, అనంతరం ఒక్కో దఫాకు 9 రోజుల పాటు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో ఏప్రిల్ 23 వరకు నీటి విడుదల కొనసాగుతుందని తెలిపారు.

### ఏఎమ్మార్పీ కింద ఆరుతడి పంటలు మేలు

ఏఎమ్మార్పీ కింద ఆరు తడి పంటలు రైతులకు ప్రయోజనం చేకూరుస్తాయని ఎస్ఈ అజయ్ కుమార్ సూచించారు. హైలెవల్ కెనాల్ కింద 1.97 లక్షల ఆయకట్టుకు, లో లెవల్ కెనాల్ కింద 42.950 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందిచేందుకు నీటి పారుదల శాఖ ప్రణాళికలను సిద్ధం చేసుకుందన్నారు.